సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం | 16 | ఆగస్టు | 2024

న్యూస్‌రీల్

దేశభద్రతలో భాగం కావాలి

• ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: ఎందరో త్యాగధనులు ప్రాణాలు అర్పించి తీసుకొచ్చిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకునేందుకు దేశభద్రతలో భాగస్వాములు కావాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పోలీసులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. తంగళ్లపల్లి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏఎస్పీలు శేషాద్రిని రెడ్డి, చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాలను అధిగమించి.. సర్కార్ కొలువు కొట్టి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పేదరికం అనుభవిస్తున్న కుటుంబం.. అడుగడుగున ఆర్థిక ఇబ్బందులు.. అయినా వాటిని అధిగమించి సర్కార్ కొలువు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది మ్యాన స్నేహ. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మ్యాన లక్ష్మి-రవీందర్ దంపతుల కూతురు స్నేహ ఎమ్మెస్సీ(మ్యాథ్స్), బీఈడీ పూర్తి చేసింది. స్నేహకు ఉన్నత విద్య కోసం జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైన మొక్కవోని ధైర్యంతో అధిగమించింది. కాంపిటేటీవ్ పరీక్షలు అనేకం రాసింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదల చివరికి ఫలించింది. ప్రభుత్వ గురుకులం పాఠశాలలో టీజీటీగా ఉద్యోగం వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన స్నేహను పలువురు అభినందించారు.

గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మను కలిసిన జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు



సిరిసిల్లటౌన్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మను జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కలిశారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గవర్నర్ నిర్వహించిన రెడ్‌క్రాస్ జిల్లాల ప్రతినిధులతో సమావేశంలో పాల్గొన్నారు. సిరిసిల్ల నేతకార్మికుల సమస్యలను రెడ్‌క్రాస్ జిల్లా ఎలక్టెడ్ కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంగీతం శ్రీనివాస్ గవర్నర్‌కు వివరించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ ప్రయాకరావు వేణుకుమార్ తదితరులు ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణ వద్దు'



సిరిసిల్లటౌన్: ఎస్సీ వర్గీకరణ వద్దని.. కలిసి ఉండడమే ముద్దని మాలమహానాడు నేతలు పిలుపునిచ్చారు. సిరిసిల్లలో గురువారం ఎస్సీ వర్గీకరణ ఎత్తివేయాలని కోరుతూ నిరసన చేపట్టారు. తొలుత పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. మాల మహానాడు జిల్లా, రాష్ట్ర నాయకులు తుంగ శివరాజు, బుర్క గోపాల్, జక్కుల యాదగిరి, నాలుక సత్యం, బాబ్జి, రమేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌కు రూ.1.50లక్షల విరాళం



ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేందుకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వెన్నమనేని శ్రీనివాస్‌రావు భారీ విరాళం అందించి ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాధాకిషన్‌రావుకు గురువారం రూ.1.50 లక్షలతోపాటు బోధకులకు రెండేళ్ల వేతనాలు అందించారు. మాజీ సర్పంచ్ తస్నీరు గౌతం రావు, ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ద్యావతి పండరి, మాజీ ఎంపీటీసీ బాలకిషన్, హెచ్‌ఎం రాధాకిషన్‌రావు, నాయకులు తోట ధర్మేందర్, కావటి మహిపాల్, జంగ రాజు, కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యం



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



జెండా వందనం చేస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్, జిల్లా జడ్జి ప్రేమలత, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్

- రైతుల రుణమాఫీ చేశాం
- రైతు భరోసాలో ఎకరానికి రూ.15వేలు ఇస్తాం
- నేతన్నలకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇస్తాం
- పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
- త్వరలో పెన్షన్లు పెంచుతాం
- రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రణాళిక
- సిరిసిల్లలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: అభివృద్ధి పనులు చేపడుతూ.. సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాలకు చేరేలా చేయడమే ప్రజాపాలన లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం జాతీయజెండాను ఆవిష్కరించి, జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

అసాధ్యమన్న రుణమాఫీ చేశాం

గత ప్రభుత్వాలు అసాధ్యమని చెప్పిన రుణమాఫీని రూ.2లక్షల వరకు చేశాం. జిల్లాలో రెండు విడతల్లో 35,700 మంది రైతుల రూ.283.48 కోట్ల రుణాలను మాఫీ చేశాం. మూడో విడత కింద రూ.2 లక్షల రుణమాఫీ కానుంది. రైతులకు దక్కాల్సిన పెట్టుబడిని గత ప్రభుత్వాలు భూస్వాములకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అందించి ప్రజాధనాన్ని వృథా చేశాయి. రైతులకు మాత్రమే ఈ పథకం వర్తింపజేసేలా మార్గదర్శకాలు రూపొందిస్తున్నాం. రైతులకు ఎకరానికి రూ.15వేల పెట్టుబడి సాయాన్ని త్వరలోనే ప్రారంభించనుంది. రైతు కూలీలకు ఏటా రూ.12వేలు అందిస్తాం. పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తాం. సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తాం.

ప్రజాసమస్యల పరిష్కారం



ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు డిసెంబర్ 9వ తేదీ నుంచి ప్రజాభవన్‌లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో రాష్ట్ర మంత్రులు అర్జీలు స్వీకరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రతీ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్, జిల్లా అధికారులు ప్రజల వినతిపత్రాలు స్వీకరిస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నాం. మహిళలకు మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. జిల్లాలో రూ.44.93కోట్ల విలువైన 1,12,99,423 జీరో టికెట్లపై మహిళలు ప్రయాణించారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను జిల్లాలో 95,146 కుటుంబాలకు అమలుచేస్తూ రూ.5కోట్ల సబ్సిడీని అందించాం. గృహజ్యోతిలో 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తూ విద్యుత్ సంస్థలకు రూ.16.95 కోట్లు చెల్లించాం.

రాజన్న ఆలయ అభివృద్ధికి చర్యలు

రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించాం. భక్తులకు సులభంగా దర్శనం కల్పించేందుకు బ్రేక్ దర్శనాన్ని అమల్లోకి తెచ్చాం. భక్తులకు వసతి కోసం రూ.32కోట్లతో గుడి చెరువులో 96 గదులను నిర్మించనున్నాం. ఆలయ కోడెలకు నీడ కల్పించేందుకు రూ.66లక్షలతో షెడ్లు, రూ.43లక్షలతో సీసీ ఫ్లోరింగ్, రూ.18 లక్షలతో డ్రెయినేజీ, జాతరగ్రౌండ్ వద్ద గల గోశాలలో రూ.50 లక్షలతో షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశాం. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణకు రూ.9.99కోట్లు, గుడి చెరువులో రూ.12కోట్లతో టూరిజం శాఖ ఆధ్వర్యంలో బండ్, పార్క్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

రూ.350కోట్లతో చెరువులను నింపుతాం

జిల్లాలోని 9, 10, 11 ప్యాకేజీల పనులు పురోగతిలో ఉన్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి ద్వారా జిల్లాలో సాగునీటి కష్టాలు దూరం చేసేందుకు రూ.350 కోట్లతో పనులు చేపట్టనున్నాం. జిల్లాలో రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ విభాగాల పరిధిలోని రహదారుల నిర్మాణం, అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాం. చందుర్తి-మోత్కురావుపేట రోడ్డుకు అటవీ శాఖ అనుమతులు రానున్నాయి.

నేతన్నలకు భరోసా

విద్యార్థుల యూనిఫాం క్లాత్ ఉత్పత్తి చేసే ఆర్డర్లను సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు అందించాం. రూ.28.84కోట్ల విలువైన క్లాత్ ఆర్డర్లను సిరిసిల్ల నేతపరిశ్రమకు అందించి, రూ.19.54కోట్లు చెల్లించాం. బతుకమ్మ చీరల బకాయిల్లో గత ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.247కోట్లలో రూ.155 కోట్లు చెల్లించాం. నేతన్న బీమా పథకంలో 4,806 మందికి బీమా కల్పించాం. వివిధ కారణాలతో మరణించిన 38 మంది కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.1.90 కోట్లను చెల్లించాం. ఈ పథకంలో నమోదు కాని కార్మికులకు మరోసారి అవకాశం కల్పించి మరో 800 దరఖాస్తులు స్వీకరించాం. నేత కార్మికులకు యారన్ సబ్సిడీ అందజేశాం. ఇందిరా మహిళాశక్తిలో మహిళా సంఘాలతో 12 రకాల వివిధ వ్యాపార, వాణిజ్య యూనిట్లు నెలకొల్పనున్నాం. జిల్లాలో 7,959 స్వశక్తి సంఘాలకు రూ.533.83కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం కాగా, ఇప్పటికే 1,302 సంఘాలకు రూ.173.98 కోట్ల రుణాలు అందించాం. జిల్లాలో 96వేల జాబ్‌కార్డులను జారీ చేసి ఉపాధి కల్పించడం జరుగుతుంది.



పెన్షన్లు పెంచుతాం

జిల్లాలో 1,19,449 మంది పింఛన్‌దారులకు ప్రతీ నెల రూ.26కోట్లు పంపిణీ చేస్తున్నాం. త్వరలో పెన్షన్లు పెంచి అందిస్తాం. వైద్యసేవలు అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేశాం. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రి, జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల ద్వారా నిరంతర వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రతీ పౌరునికి డిజిటల్ హెల్త్‌కార్డు జారీచేస్తాం. రుద్రంగి, వీర్నపల్లి మండల కేంద్రాల్లో పీహెచ్‌సీ భవనాలు పూర్తి చేస్తాం. జిల్లాలోని 510 ప్రభుత్వ పాఠశాలల్లో 45,097 మంది విద్యార్థులు చదువుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద 283 పాఠశాలలను ఎంపిక చేసి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. స్వచ్ఛదనం-పచ్చదనం నిరంతరం నిర్వహిస్తూ గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపొందించే దిశగా అడుగులు వేస్తాం.

పేదలకు ఇళ్లు ఇస్తాం

ఇళ్లు లేని అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6లక్షల అందించనున్నాం. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందిస్తాం. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. భూరికార్డుల్లో జరిగిన పొరపాట్లను సవరించి భూప్రక్షాళన చేస్తాం. జిల్లాలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ ద్వారా 36,937 దరఖాస్తులు పరిష్కరించాం. జిల్లాలోని 71 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకు శాఖల ద్వారా జిల్లా ప్రజల ఆర్థికాభివృద్ధికి రుణాలు అందిస్తున్నాయి. జిల్లాలోని 1,73,745 కుటుంబాలకు అవినీతికి తావులేకుండా ఈ-పాస్ యంత్రాల సాయంతో 345 రేషన్‌షాపుల ద్వారా రేషన్‌బియ్యం సరఫరా చేస్తున్నాం. ఈ యాసంగిలో 259 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 49,930 మంది రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి రూ.578.16కోట్లు వారి ఖాతాల్లో జమచేశాం. అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నపిల్లల పూర్వప్రాథమిక విద్యాకేంద్రాలు (ప్రీస్కూల్స్)గా మార్చాం. జిల్లాలోని 587 అంగన్‌వాడీ కేంద్రాల్లో 15,374 మంది పిల్లలకు యూనిఫామ్స్ అందించాం. సఖీ సెంటర్‌లో 1,126 కేసులు నమోదు కాగా, 799 కేసులు పరిష్కరించాం. వనమహోత్సవంలో 6.6 లక్షల మొక్కలు నాటి సంరక్షించే చర్యలు చేపట్టాం.

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల అభివృద్ధికి..

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. వేములవాడ గుడి చెరువులోకి మురుగునీరు వెళ్లకుండా రూ.3కోట్లతో డైవర్షన్ కాలువ నిర్మిస్తున్నాం. రూ.2కోట్లతో వేములవాడ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎకరం విస్తీర్ణంలో పార్క్ నిర్మాణం పూర్తయింది. జిల్లాలో 1.41 కోట్ల చేపపిల్లలను, 12 ఎంపిక చేసిన చెరువుల్లో 100 శాతం సబ్సిడీపై, 44 లక్షలకు పైగా రొయ్యపిల్లలను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. జిల్లాలో 255 గ్రామాలు, రెండు మున్సిపాలిటీల్లో మంచినీటి సరఫరాను బాగు చేసేందుకు ఇంటింటి సర్వే చేశాం. కొత్త నల్లాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మాదకద్రవ్యాల రహితంగా..

శాంతిభద్రతల నిర్వహణ సమర్థంగా జరిగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈరోజే మనమంతా మాదక ద్రవ్యాల రహిత దేశాన్ని సృష్టించడానికి సమష్టిగా నిబద్ధత చాటుకోవాలి. డ్రగ్స్, గంజాయిని నివారించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను కాపాడుతున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ సమాచారాన్ని నిరంతరం చేరవేస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, జిల్లా ప్రజాప్రతినిధులకు, అధికారులకు స్వాతంత్ర్య వేడుకల శుభాకాంక్షలు తెలుపుతూ ముగించారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, జిల్లా జడ్జి ప్రేమలత, ఏఎస్పీలు శేషాద్రినిరెడ్డి, చంద్రయ్య, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, మాజీ ఎమ్మెల్యే రేగులపాటి పాపారావు, ×సెస్₹ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, కాంగ్రెస్ నాయకులు కె.కె.మహేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన



జయహో.. ఆకట్టుకున్న డ్యాన్స్



ముస్తాబాద్‌లో భారీ జెండా



జెండా వందనం చేస్తున్న మున్సిపల్ పాలకవర్గం



విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేత



డ్రోన్ పనితీరు పరిశీలిస్తున్న అధికారులు



మహిళా సంఘాలకు రుణాలు అందజేత



జెండా వందనం చేస్తున్న జిల్లా జడ్జి ప్రేమలత,



రాజన్న ఆలయం వద్ద జెండా ఎగురవేస్తున్న అధికారులు

31,560 మంది రైతులు.. రూ.552.19 కోట్లు

- మూడో విడత రుణమాఫీ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాతాల్లో జమ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం మూడోవిడత రుణమాఫీకి గురువారం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రూ.2లక్షల్లోపు రుణం ఉన్న 31,560 మంది లబ్ధి పొందనున్నారు. వీరికి సంబంధించిన 41,777ఖాతాల్లో మొత్తం రూ.552.19 కోట్లను జమచేసే ప్రక్రియ ప్రారంభించింది.

మూడు విడతల్లో... రూ.1843.19 కోట్లు

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మెనిఫెస్టోలో రూ.2లక్షల్లోపు రుణం మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే ఆగస్టు 15లోపు మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు కాలపరిమితి(కటాఫ్)గా నిర్దేశించారు. మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలను జూలై 18న మాఫీ చేసింది. మొదటి విడతలో ఉమ్మడి జిల్లాలో 1,28,762 మంది ఖాతాల్లో ప్రభుత్వం రూ.710.29 కోట్లు జమచేసింది. జూలై 30న రెండో విడతలో రూ.లక్షన్నరలోపు ఉన్న 63,286 మంది ఖాతాల్లో రూ.580.71 కోట్లు మాఫీ చేసింది. మూడో విడతలో రూ.2లక్షల లోపు రుణాలు ఉన్న 41,777 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.552.19 కోట్లు మాఫీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. మొత్తంగా మూడు విడతల్లో కలిపి 2,33,824 ఖాతాల్లో రూ.1843.19 కోట్ల పంట రుణాలను మాఫీ చేసింది.

కొర్రీలతో మాఫీకాక అవస్థలు

మూడు విడతల్లో రుణ మాఫీ చేసిన, చాలా మంది రైతుల పేర్లు మాఫీ జాబితాలో లేకపోవడంతో వారందరూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు ఖాతాలో ఒక పేరు, ఆధార్‌లో మరోపేరు, రేషన్ కార్డు లేక, వడ్డీ ఎక్కువ అయ్యి.. ఇలా దాదాపు 32 కారణాలతో పలువురు రైతులకు మాఫీ కాక ఇబ్బందులు తలెత్తాయి. ఆయా జిల్లాలో రైతులకు ఏవైనా సందేహాలు, సమస్యలు తలెత్తితే నివృత్తి, పరిష్కారం చేసేందుకు మండలాలవారీగా ఏవో, ఏఈవోలను సంప్రదించవచ్చని, ప్రత్యేకంగా రిజిస్టర్ నిర్వహిస్తూ సమస్య పరిష్కరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి కరీంనగర్‌జిల్లా రుణమాఫీ వివరాలు..

	మొదటి విడత		రెండో విడత		మూడోవిడత	
జిల్లా	ఖాతాలు	మాఫీ (రూ.కోట్లలో)	ఖాతాలు	మాఫీ (రూ.కోట్లలో)	ఖాతాలు	మాఫీ (రూ.కోట్లలో)
కరీంనగర్	36,023	186.39	18,510	173.28	12,034	152.65
జగిత్యాల	39,229	207.00	19,623	169.00	13,799	172.34
పెద్దపల్లి	29,724	149.42	13,238	122.43	8,268	101.75
సిరిసిల్ల	23,785	167.48	11,915	116.00	7,676	125.45
మొత్తం	1,28,761	710.29	63,286	580.71	41,777	552.19



ఘనంగా తీజ్

వట్టిమల్ల తీజ్ వేడుకల్లో ఆది శ్రీనివాస్, తదితరులు

కోనరావుపేట/చందుర్తి(వేములవాడ): అజ్మీరాతండా, కమ్మరిపేటతండా, భుక్యరెడ్డితండా, చందుర్తి మండలం దేవునితండాల్లో గురువారం తీజ్ ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులుగా గోధుమనారును నానబెట్టి భవాని మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చేపూరి గంగాధర్, తాళ్లపెల్లి ప్రభాకర్, లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్, తండా నాయకులు లకావత్ రాజు, బానోత్ తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చందుర్తి సీఐకి ఇండియన్ పోలీస్ మెడల్

• సీఎం చేతుల మీదగా అందజేత



మెడల్ అందుకుంటున్న చందుర్తి సీఐ

చందుర్తి(వేములవాడ): చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గాండ్ల వెంకటేశ్వర్లు ఇండియన్(ప్రెసిడెంట్) పోలీస్ మెడల్‌ను గురువారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని గోల్కొండకోటలో గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మెడల్‌ను ప్రదానం చేశారు. ఎస్సై స్థాయి నుంచి సీఐగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లు తమ సర్వీసులో అనేక రివార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. విధి నిర్వహణలో అందించిన అత్యుత్తమ సేవలకు కేంద్ర హోంశాఖ విశిష్ట సేవ-2023 కింద ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేసింది. తనకు ఇండియన్ పోలీస్ మెడల్ దక్కడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ మెడల్ బాధ్యతను మరింత పెంచిందని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కానిస్టేబుల్‌కు ప్రశంసలు



ఎల్లారెడ్డిపేట: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పోలీస్ కానిస్టేబుల్‌గా నిమ్మ అనిల్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని డీజీపీ ఆఫీస్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. నారాయణపూర్‌కు చెందిన అనిల్‌రెడ్డికి ఉత్తమ కానిస్టేబుల్‌గా ప్రశంసాపత్రం రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రితో ఎమ్మెల్సీ భేటీ


కరీంనగర్ కార్పొరేషన్ : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి భేటీ అయ్యారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు వచ్చిన శ్రీధర్‌బాబును జ్యోతినగర్‌లోని సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నివాసంలో జీవన్‌రెడ్డి ప్రత్యేకంగా కలిశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంలో జీవన్‌రెడ్డి అలకబూనడం తెలిసిందే. ఆ సమయంలో కాంగ్రెస్ అధిష్టానం తరఫున మంత్రి శ్రీధర్‌బాబు జగిత్యాలకు వెళ్లి జీవన్‌రెడ్డితో చర్చలు జరిపారు. ఈక్రమంలో గురువారం నగరంలో మంత్రి, ఎమ్మెల్సీల భేటీ ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ భేటీలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కూడా ఉన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శ్రీధర్‌బాబును డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

హమాలీ మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గొల్లపల్లి సమీపంలోని ఓ గోదాంలో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన నీతుకుమార్‌సదా(22) అనే హమాలీ మృతి చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం.. నీతుకుమార్‌సదా మూడు నెలల క్రితం గోదాంలో పనిచేసేందుకు వచ్చాడు. బుధవారం రాత్రి తన గదిలో ఉక్కపోతగా ఉండడంతో సమీపంలో పార్కింగ్ చేసిన లారీపై నిద్రపోయాడు. నిద్రమత్తులో ప్రమాదవశాత్తు కింద పడగా తలకు తీవ్రగాయమైంది. తోటి హమాలీలు సుల్తానాబాద్ ఆస్పత్రి, అక్కడి నుంచి కరీంనగర్, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా చనిపోయాడు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

• 243 మందికి ప్రశంసాపత్రాల ప్రదానం



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నుంచి ప్రశంసాపత్రం తీసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, చిత్రంలో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల: స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు, అధికారుల సేవలకు ప్రశంసలు దక్కాయి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ సమక్షంలో ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల ఆర్డీవో ఎల్.రమేశ్, వేములవాడ ఆర్డీవో ఎస్.రాజేశ్వర్, డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో రమేశ్‌కుమార్, డీటీవో కె.నీరజ, డీఏవో వి.భాస్కర్, డీఎస్‌వో ఎస్.జితేందర్‌రెడ్డి, డీపీఆర్‌వో వి.శ్రీధర్, ఎల్‌డీఎం ఎన్.మల్లికార్జున్, మిషన్ భగీరథ ఈఈ ఎన్.విజయ్‌కుమార్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ జి.అన్వేష్‌లను అవార్డు వరించాయి. వీరి సేవలను గుర్తించి ప్రశంసాపత్రాలు అందించడంతో వారు పనిచేస్తున్న ఆఫీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.



శేషాద్రి డీఆర్‌డీవో | రమేశ్‌కుమార్ డీఈవో | కె.నీరజ జిల్లా కోశాధికారి



ఎస్.రాజేశ్వర్ వేములవాడ ఆర్డీవో | వి.శ్రీధర్ డీపీఆర్‌వో | వి.భాస్కర్ జిల్లా వ్యవసాయాధికారి



ఎల్.రమేశ్ సిరిసిల్ల ఆర్డీవో



షరీఫొద్దీన్ సిరిసిల్ల తహసీల్దార్



సంతోష్, జిల్లా ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్



చింతోజు భాస్కర్ స్వచ్ఛందసంస్థల చైర్మన్



చంద్రయ్య అడిషనల్ ఎస్పీ



ఎస్.జితేందర్ పౌరసరఫరాల అధికారి



ఎన్.మల్లికార్జున్ లీడ్‌బ్యాంకు మేనేజర్



రమేశ్ ఎస్పీ, పీఆర్‌వో



లక్ష్మీనారాయణ, మెడికల్ కాలేజీ, ప్రిన్సిపాల్



అన్వేశ్, వేములవాడ మున్సిపల్ కమిషనర్



చంద్రశేఖర్‌రెడ్డి సిరిసిల్ల డీఎస్పీ



శ్రీనివాస్‌గౌడ్ ఎల్లారెడ్డిపేట, సీఐ



మనోజ్ కానిస్టేబుల్



సుధాకర్ తంగళ్లపల్లి ఎస్సై



కిరణ్ ఎస్సై



మారుతి ఎస్సై



రమాకాంత్ ఎల్లారెడ్డిపేట ఎస్సై



రాజు ఎస్సై



ప్రమీల ఏఎస్సై

మువ్వన్నెల జెండా రెపరెపలు



బీఆర్‌ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ



కాంగ్రెస్ కార్యాలయంలో..

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో పంద్రాగస్టు వేడుకలు మిన్నంటాయి. వాడవాడలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 78వ స్వాతంత్య్ర వేడుకల్లో జాతీయభావం మిన్నంటింది. గురువారం జిల్లా అధికారులు వారి కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయాల్లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీపీవోలో ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా కోర్టులో జడ్జి ఎస్.ప్రేమలత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీచౌక్, మున్సిపల్ కార్యాలయాలపై చైర్‌పర్సన్ జిందం కళ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా..వేలాది సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, విద్యాధికారి కార్యాలయంలో డీఈవో రమేశ్‌కుమార్, డీఎంహెచ్‌వో వసంతరావు, డీటీవో లక్ష్మణ్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగార్జున, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, అర్బన్‌బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ జాతీయ జెండాలను ఎగురవేశారు.

పార్టీలు..కులసంఘాలు..

జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు నాగుల సత్యనారాయణగౌడ్, గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కార్మికభవనంలో గుంటి వేణు, సీపీఎం కార్యదర్శి మూషం రమేశ్, బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కూర అంజిరెడ్డి, పౌర సంక్షేమ సమితి కార్యాలయంలో బియంకార్ శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, సామాజిక సమరసత వేదిక కన్వీనర్ మోర శ్రీనివాస్, టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి జువ్వాజి విమల, దివ్యాంగుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు మాదాసు రాజేశ్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న ర్యాలీలు..ప్రదర్శనలు

పంద్రాగస్టును పురస్కరించుకుని విద్యార్థుల ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వజ్రోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు జాతీయ నేతల వేషధారణలతో ర్యాలీలు చేపట్టారు. భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శిస్తూ దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజల వేషధారణలు, జాతీయ నాయకులు రూపాల్లో చిన్నారులు ఆకర్షణగా నిలిచారు. దివ్యాంగుల సంక్షేమ సమితి, స్వచ్ఛంద సంస్థలు, కులసంఘాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న స్టాల్స్



సిరిసిల్ల: స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. డీఆర్‌డీవో, ఐసీడీఎస్, చేనేత, జౌళి శాఖ, విద్యాశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ స్టాల్స్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. పోలీస్ వాహనాన్ని ప్రారంభించారు. అంతకు ముందు నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు దేశభక్తి గీతాలపై నృత్యాలు చేశారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఓపెన్ టాప్ జీపులో పరేడ్‌ను తిలకించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో లీడ్‌బ్యాంక్, వివిధ బ్యాంకుల ద్వారా 528 మహిళాసంఘాలకు చెందిన 5,626 మందికి రూ.91.84 కోట్ల రుణాల చెక్కును పంపిణీ చేశారు. 84 సంఘాలకు చెందిన 423 మంది మహిళలకు స్త్రీనిధి ద్వారా రూ.5.22 కోట్లు, మెప్మా ఆధ్వర్యంలో 80 మహిళా సంఘాలకు రూ.10కోట్ల రుణాల చెక్కులు అందజేశారు. కారుణ్య నియామకాల కింద కర్నె దేవేంద్ర, కంకనాల దేవలత, అనిల్‌కుమార్‌కు నియామకపత్రాలు అందజేశారు.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

వేడుకలు జరుగుతున్నంత సేపు ఉక్కపోతతో అతిథులు, వేడుకలకు వచ్చిన వారు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. చమటలు కక్కుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రసంగం కొనసాగించారు. మరోవైపు వేడుకలకు వచ్చిన వారంతా చమటతో తడిసిపోయారు.

ప్రేమలో పడిందని చెల్లిపై దాడి

మెట్‌పల్లిరూరల్: తోడబుట్టిన చెల్లి ఓ యువకుడిని ప్రేమిస్తోందనే కారణంతో సోదరుడు ఆమెపై దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. స్థానికులు, పోలీసుల కథనం. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన బోదాసు రాజ్‌కుమార్, మానస అన్నాచెల్లెళ్లు. ఇద్దరూ ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట శివారులోని టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సోలార్, బ్యాంకింగ్ ఫైనాన్స్ కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్నారు. గురువారం స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న అన్నాచెల్లెళ్లు ఇంటికి వెళ్తున్న సమయంలో మానస ప్రేమ వ్యవహారం చర్చకు వచ్చింది. తీరు మార్చుకోవాలని సూచించగా.. ఇరువురి మధ్య మాటమాట పెరిగి చర్చకు దారితీసింది. దీంతో దాడికి పాల్పడ్డాడు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు.

రాజన్న సేవలో దేవాదాయశాఖ అధికారులు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులు



కొండగట్టు ఈవో రామకృష్ణను సత్కరిస్తున్న అర్చకుడు శరత్‌శర్మ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కొండగట్టు ఈవో రామకృష్ణ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. గురువారం రద్దీ పెరిగింది. భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తుల ద్వారా రూ.20 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మిస్టరీగా యువకుడి అదృశ్యం

• దాడిచేసినట్లు ఆనవాళ్లు
• డాగ్‌స్క్వాడ్‌తో గాలించిన పోలీసులు
• అనుమానంతో బావుల్లో గజ ఈతగాళ్లతో గాలింపులు
• అయినా దొరకని ఆచూకీ



అనుమానిత ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు



గంగరాజు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): మండలంలోని ఆశిరెడ్డిపల్లెలో గురువారం ఓ యువకుడి అదృశ్యం మిస్టరీగా మారింది. పోలీసులు, గజ ఈతగాళ్లు పొద్దాంత గాలించినా ఆచూకీ లభించలేదు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని ఆశిరెడ్డిపల్లెకు చెందిన ఎక్కలదేవి గంగరాజుకు, అతని చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్యకు మధ్య కొన్నేళ్లుగా భూవివాదం కొనసాగుతోంది. ఈ విషయమై చందుర్తి పోలీసుస్టేషన్‌లో ఇప్పటికే రెండుసార్లు కేసు నమోదైంది. ఇటీవల మళ్లీ గొడవకు దిగడంతో పోలీసులు గంగరాజును చందుర్తి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ నేపథ్యంలో వివాదానికి కారణమైన వ్యవసాయ భూమిలో తన చిన్నాన్న విత్తనాలు వేస్తున్నాడని తెలియడంతో అడ్డుకునేందుకు గురువారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో అక్కడికి వెళ్లాడు. అదే పొలంలో గంగరాజు బైక్ ధ్వంసమై పడి ఉంది. యువకుడి సెల్‌ఫోన్, చెప్పులు, షర్టుపై రక్తపు మరకలు ఉన్నాయి. గురువారం ఉదయం అటుగా వెళ్లిన రైతులు వీటిని చూసి గంగరాజు బావమ్మర్ది గణేశ్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. చందుర్తి పోలీసులు అక్కడికి చేరుకొని డాగ్‌స్క్వాడ్‌తో గాలించారు. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట ఎస్సైలు శ్రీకాంత్, సిరిసిల్ల అశోక్, శేఖర్‌రెడ్డి తమ పోలీసు బృందాలతో గాలించారు. రెండు వ్యవసాయ బావుల వద్ద డాగ్‌స్క్వాడ్స్ నిలిచిపోవడంతో బావుల్లో గత ఈతగాళ్లతో గాలించినా ఆచూకీ లభించలేదు.

యువకుడి తీరుపైనా అనుమానాలు

అదృశ్యమైన యువకుడు గంగరాజు తీరుపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ తన ఇంట్లో దొంగతనం జరుగకున్న జరిగినట్లు ఇతరులపై ఆరోపణలు చేశారని తెలిపారు. అంతేకాకుండా తన చిన్నాన్న పంట పొలంలో గడ్డి మందు పిచికారీ చేసి తప్పించుకునేందుకు సీన్ క్రియేట్ చేశాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

గంరాజుపై దాడి చేసి హత్య చేశారని అనుమానాలు వ్యక్తం కావడంతో అతని చిన్నాన్నతోపాటు ఇద్దరు కుమారులను చందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై వారిని విచారించినట్లు తెలిసింది.

ముగిసిన తల్లీకూతుళ్ల అంత్యక్రియలు

• నివేదిక కోరిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ
• బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్



శిరీష, పసికందు మృతదేహాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): డెంగీతో మృతిచెందిన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన బాలింత తాళ్లపల్లి శిరీష, పసికందు అంత్యక్రియలను గురువారం పూర్తి చేశారు. శిరీష భర్త బతుకుదెరువు కోసం జోర్డాన్ దేశానికి వెళ్లగా.. అతను స్వగ్రామం వచ్చే వరకు మృతదేహాలను ఫ్రీజర్‌లో భద్రపరిచారు. మృతురాలి భర్త చంద్రం గురువారం ఉదయం గ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. డెంగీతో మరణించినట్లు వార్త కథనాలు ప్రచురితం కావడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నివేదిక కోరారు. ఈమేరకు జిల్లా వైద్యాధికారి వసంత్‌రావు ఆదేశాలతో మండల వైద్యాధికారి స్రవంతి గ్రామంలో విచారణ చేపట్టారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని వివిధ సంఘాలు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న కారు

• భార్యాభర్తలకు గాయాలు



మాచారెడ్డి: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలైన ఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌కు చెందిన నరేందర్‌రెడ్డి, రేణుక దంపతులు పనినిమిత్తం కారులో కామారెడ్డికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో మండలంలోని ఘన్‌పూర్ శివారులోకి రాగానే కారు అదుపు తప్పడంతో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో కారులో ఉన్న భార్యాభర్తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

సారూ.. ఇంకెప్పడొస్తరు..



పిల్లల వార్డులో తల్లిదండ్రుల ఆందోళన

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రిలో ఓపీ సమయంలో వైద్యులు లేకపోవడంపై రోగులు, పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ, గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో చాలా సేపు పిల్లలవార్డులో వైద్యసేవలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. వైద్యుల కోసం వాకబు చేస్తుండగా సిబ్బంది ఇష్టానుసారంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్ర జ్వరంతో పిల్లలను తీసుకొస్తే నిర్లక్ష్యం చేయడంపై ప్రశ్నించారు. ఇతర వార్డుల్లో సైతం సిబ్బంది ప్రవర్తన సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సముదాయించి వైద్యులను ఓపీ వార్డుకు పంపించారు. వైద్యసేవల్లో కీర్తిని మూటగట్టుకున్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రిలో కొందరు సిబ్బంది నిర్వాకంతో పేరు ప్రతిష్టలు దిగజారుతున్నాయని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కోరారు.